RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ ‖ సంచిక 281 ‖ సంపుటి 4 ‖ ఆదివారం ‖ 12-07-2026 ‖ పేజీలు 4 ‖ వెల 3/-



## కేసముద్రంలో సీఎంఆర్ దొంగలపై
# పంజా విసరగలరా?

- సీఎంఆర్ రికవరీ చేసే ‘దమ్ము’ అధికారులకు ఉందా..?
- రాజకీయ ఒత్తిళ్లకు లొంగుతారా....?
- ఆగస్టు గడువు తర్వాతైనా దాడులు చేసే ధైర్యం చేస్తారా..?
- తూతూమంత్రపు తనిఖీలతోనే సరిపెడతారా..?
- కేసముద్రం రైతాంగం, ప్రజల సూటి ప్రశ్న..!



హైదరాబాద్, జూలై 11 (ప్రభాత గమనం) :

అన్నం పెట్టే రైతుకు ఒక న్యాయం... కోట్లు కుమ్మరించే మిల్లర్లకు మరో న్యాయమా? ప్రభుత్వ నిబంధనలు కేవలం సామాన్యులకేనా? బడా బాబులకు వర్తించవా? ప్రస్తుతం కేసముద్రం పరిధి లోని రైస్ మిల్లుల వ్యవహారం చూస్తుంటే సామాన్య ప్రజల నుంచి వినిపిస్తున్న బాహాటమైన ప్రశ్నలివి. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) బకాయిల వసూలు విషయంలో స్థానిక యంత్రాంగం అనుసరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసముద్రం మిల్లర్ల వద్ద పేరుకుపోయిన సుమారు రూ. 40 కోట్ల సీఎంఆర్ ధాన్యాన్ని వసూలు చేసే ‘దమ్ము, ధైర్యం’ అధికారులకు ఉన్నాయా అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. కేసముద్రం పరిధిలో ఉన్న అనేక రైస్ మిల్లుల వెనుక ప్రజాప్రతినిధులు, బడా రాజకీయ నాయకుల హస్తం ఉందనేది బహిరంగ రహస్యం. సకాలంలో ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా కాలయాపన చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు వెళ్తే... ‘పై’ నుంచి ఫోన్లు వస్తున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా అధికారులు నిష్పక్షపాతంగా పని చేయగలరా? అధికార బలంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మిల్లులపై చట్టపరమైన చర్యలు తీసుకునే సాహసం చేస్తారా?కేవలం చిన్న మిల్లులను టార్గెట్ చేసి, పెద్ద తలకాయలను వదిలేస్తారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.ప్రభుత్వం విధించిన గడువుల మీద గడువులు ముగుస్తున్నా సీఎంఆర్ వసూళ్లలో ఆశించిన పురోగతి అధికారులలో కనిపించడం లేదు. వచ్చే ఆగస్టు నెల తర్వాతైనా అధికారులు కఠినంగా వ్యవహరిస్తారా? లేక ఎప్పటిలాగే నోటీసులతో కాలయాపన చేస్తారా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఆగస్టు గడువు ముగిసిన వెంటనే ఏమాత్రం వెనకడుగు వేయకుండా, రాజకీయ సిఫార్సులను పక్కన పెట్టి మిల్లులపై మెరుపు దాడులు జరిపే సత్తా అధికారులకు ఉందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు."రైతు ధాన్యం అమ్ముకుంటే రూపాయి తేడా వచ్చినా వదిలిపెట్టని అధికారులు... కోట్ల విలువైన ప్రభుత్వ సొమ్మును (సీఎంఆర్) నొక్కిన మిల్లర్ల విషయంలో ఎందుకు మెతకవైఖరి అవలంబిస్తున్నారు? రాజకీయ నాయకులు ఎంతటి వారైనా సరే, ప్రజల సొమ్మును రికవరీ చేయాల్సిందే."ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతున్నా కేసముద్రంలో మిల్లర్ల ‘మాఫియా’ శైలి మారడం లేదనేది వాస్తవం. ఇన్నాళ్లూ తనిఖీల పేరిట అధికారులు చేస్తున్న హడావుడి అంతా నామ్‌కే వాస్తేగా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కేసముద్రంలో రోజుకో రైస్ మిల్లు పుట్టుకొస్తూ సిఎంఆర్ ను నొక్కేయ్యాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఎంతోకొంత మూలధనంతో మిల్లు లను నిర్మించుకొని జిల్లా అధికారులను మచ్చిక చేసుకుని సిఎంఆర్ ను ప్రభుత్వ ఖజానాకు పంగనామం పెట్టాలని చూస్తున్నారు. నిబంధనల ప్రకారం గడువు ముగియగానే ప్రతీ మిల్లులో నిల్వలను లెక్కగట్టాలి. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే... జైలుకు పంపేలా,ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుంది. లేదంటే అధికారులు కేవలం మిల్లర్ల చేతుల్లో ‘కీలుబొమ్మలు’గా మిగిలిపోయారనే ముద్ర శాశ్వతంగా ఉండిపోతుంది. మరి ఆగస్టు తర్వాత ఏం జరగబోతోందో వేచి చూడాలి మరి....




## ఓటీటీపైనా
# సెన్సార్ కత్తి!


- డిజిటల్ కంటెంట్‌పై కేంద్రం కఠిన నిబంధనల దిశగా అడుగులు
- సినిమాలతో పాటు వెబ్‌సిరీస్‌లకూ ముందస్తు సర్టిఫికేషన్ ప్రతిపాదన
- సృజనాత్మక స్వేచ్ఛకు భంగం కలుగుతుందంటూ పరిశ్రమ వర్గాల ఆందోళన

న్యూఢిల్లీ, ప్రభాత గమనం, జూలై 11:

ఓటీటీ వేదికల్లో విడుదలయ్యే సినిమాలు, వెబ్‌సిరీస్‌లపై కేంద్ర ప్రభుత్వం మరింత కఠిన నిబంధనలు అమలు చేసే దిశగా కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం స్వీయ నియంత్రణతో కొనసాగుతున్న డిజిటల్ కంటెంట్‌కు కూడా సీబీఎ ఫ్‌సీ తరహాలో ముందస్తు సెన్సార్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, డిస్నీ+ హాట్‌స్టార్ వంటి ఓటీటీ వేదికల్లో ప్రస్తుతం ఐటీ రూల్స్–2021 ప్రకారం స్వీయ నియంత్రణ విధానం అమలులో ఉంది. వయస్సు ఆధారంగా కంటెంట్‌ను వర్గీకరించి ప్రసారం చేస్తున్నప్పటికీ, ఇటీవల కొన్ని సినిమాలు, వెబ్‌సిరీస్‌లలో అధిక స్థాయిలో బోల్డ్ సన్నివేశాలు, అసభ్య పదజాలం, వివాదాస్పద రాజకీయ, సామాజిక అంశాలు చోటుచేసుకుంటున్నాయనే ఫిర్యాదులు కేంద్రానికి పెద్ద ఎత్తున చేరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డిజిటల్ వేదికలపై నేరుగా విడుదలయ్యే చిత్రాలకు కూడా ముందస్తు సెన్సార్ సర్టిఫికేషన్ అవసరమా అనే అంశంపై కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, ఐటీ శాఖతో కలిసి చర్చలు జరుపుతోంది. వెబ్‌సిరీస్‌లను కూడా ఇదే పరిధిలోకి తీసుకురావాలనే ప్రతిపాదనలపై వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరిస్తోంది. ఇటీవల పంజాబీ నటుడు దిల్జీత్ దోసాంజ్ నటించిన 'సత్లుజ్' చిత్రం చుట్టూ నెలకొన్న వివాదం కూడా ఈ అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే డిజిటల్ కంటెంట్‌పై ప్రభుత్వ పర్యవేక్షణ మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే దీనివల్ల కంటెంట్ సృష్టికర్తల సృజనాత్మక స్వేచ్ఛకు భంగం కలుగుతుందని సినీ, ఓటీటీ పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇంకా అధికారిక నిర్ణయం ప్రకటించలేదు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో
# నిర్లక్ష్యం సహించేది లేదు

- జూలై 14లోపు 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి
- తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరూ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



# రేవంత్‌ది శాడిస్టు మనస్తత్వం

- రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలి
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే డైవర్షన్ రాజకీయాలు
- రైతులు నీళ్లు అడిగితే రక్తం చల్లాలనడం సీఎం హోదాకు తగదు
- శాంతిభద్రతల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం
- సాగునీటి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి
- రైతాంగం ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు

రైతులు, ప్రతిపక్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. రైతులు సాగునీరు కోరితే రక్తం చల్లాలంటూ, బెల్టుతో కొట్టాలంటూ మాట్లాడటం ఆయన అహంకారపూరిత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని, రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాలు, ప్రజా సమస్యలు, శాంతిభద్రతల అంశాలు ప్రజల్లో చర్చకు వచ్చిన ప్రతిసారీ ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం కొత్త వివాదాలను సృష్టిస్తోందని ఆరోపించారు.

— హైదరాబాద్, జూలై 11 (ప్రభాత గమనం):





# రోడ్డుపై నేమ్ బోర్డులు ఉంచొద్దు

- కాజీపేట్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వెంకన్న

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్, హనుమకొండ, కాజీపేట్ పట్టణాల ప్రజలు, వ్యాపార సంస్థల యజమానులు, చిరు వ్యాపారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కాజీపేట్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న సూచించారు. వ్యాపార సంస్థల ముందు షాపు పేరుతో ఏర్పాటు చేసే నేమ్ బోర్డులు, ప్రచార బోర్డులు, స్టాండీలు లేదా ఇతర వస్తువులను రహదారులపై ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు వాహనాల పార్కింగ్‌కు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. రోడ్లపై ఇలాంటి బోర్డులు ఉండటం వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ప్రమాదాలకు కూడా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి వ్యాపారి తన షాపుకు సంబంధించిన నేమ్ బోర్డులు, ప్రచార సామగ్రిని పూర్తిగా తన వ్యాపార ప్రాంగణంలోనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ నేమ్ బోర్డులు లేదా ఇతర అడ్డంకులు ఉంచరాదని స్పష్టం చేశారు. ఇకపై నిబంధనలను ఉల్లంఘిస్తూ ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించబోమని, సంబంధిత చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న హెచ్చరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, రహదారులను ఆక్రమణలు లేకుండా ఉంచి సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థకు తోడ్పడాలని ప్రజలకు, వ్యాపారులకు కాజీపేట్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# జప్తు చేసిన బైక్ లను తీసుకెళ్లండి

- వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



కాజీపేట, వరంగల్, హన్మకొండ ట్రైసిటీస్ ప్రాంత ప్రజలకు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. వివిధ కారణాలతో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జప్తు చేసి ఉంచిన ద్విచక్ర వాహనాల యజమానులు సంబంధిత వాహన పత్రాలతో పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తమ వాహనాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. చిన్నపాటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు లేదా ఇతర కారణాలతో జప్తు చేసిన వాహనాలు పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లయితే, వాటికి సంబంధించిన ఆర్‌సీ, బీమా, గుర్తింపు పత్రాలు తదితర అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించి వాహనాలను తీసుకెళ్లవచ్చని తెలిపారు. అయితే డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, పెండింగ్ చలాన్లు లేదా ఇతర కేసులు ఉన్న వాహనాల యజమానులు ముందుగా ఆయా కేసులను నిబంధనల ప్రకారం పరిష్కరించుకుని అనంతరం తమ వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. వరంగల్ ట్రైసిటీస్ పరిధిలోని వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ వాహనాలను త్వరితగతిన స్వాధీనం చేసుకోవాలని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోడూరి సుజాత విజ్ఞప్తి చేశారు.

# వియత్నాంలో పర్యాటక బోటు బోల్తా..

- 19 మంది తెలుగు పర్యాటకులు మృతి
- ఫు క్వాక్ ద్వీపం సమీపంలో విహారయాత్ర విషాదాంతం
- పలువురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స
- మృతుల్లో కడప, మచిలీపట్నానికి చెందిన వారు

**హనోయ్, ప్రభాత గమనం, జూలై 11:**



వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న స్పీడ్ బోటు బోల్తాపడటంతో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 19 మంది తెలుగు పర్యాటకులు మృతి చెందినట్లు సమాచారం. పలువురు తీవ్రంగా గాయపడగా, వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది. ఫు క్వాక్ ద్వీపంలో విహారయాత్రలో భాగంగా మూడు పడవల్లో భారతీయ పర్యాటకులు సముద్రంలోకి వెళ్లారు. వాటిలో ఒక స్పీడ్ బోటులో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ప్రయాణిస్తుండగా అన్ థోయ్ పోర్టుకు వెళ్తున్న సమయంలో తీరానికి సుమారు 400 మీటర్ల దూరంలో ఒక్కసారిగా బోటు బోల్తాపడింది. భారీ అలలు, ప్రతికూల వాతావరణం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని పర్యాటక బోట్లు, వియత్నాం నేవీ, స్థానిక సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అయితే బోటు పూర్తిగా తలకిందులవడంతో పాటు అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. పలువురిని సురక్షితంగా బయటకు తీసి ఆస్పత్రులకు తరలించగా, మరికొందరి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ ప్రమాదంలో కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ మృతి చెందినట్లు సమాచారం. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా ఈ విహారయాత్రలో పాల్గొంది. ప్రమాదంలో ఆయన భార్య మృతి చెందగా, కిషోర్ తీవ్ర అస్వస్థతకు గురై స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసింది. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వదేశానికి తరలించే ప్రక్రియను ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.

# రేవంత్‌ది శాడిస్టు మనస్తత్వం

- రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలి
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే డైవర్షన్ రాజకీయాలు
- రైతులు నీళ్లు అడిగితే రక్తం చల్లాలనడం సీఎం హోదాకు తగదు
- శాంతిభద్రతల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం
- సాగునీటి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి
- రైతాంగం ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు

**హైదరాబాద్, జూలై 11 (ప్రభాత గమనం):**



రైతులు, ప్రతిపక్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. రైతులు సాగునీరు కోరితే రక్తం చల్లాలంటూ, బెల్టుతో కొట్టాలంటూ మాట్లాడటం ఆయన అహంకారపూరిత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని, రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాలు, ప్రజా సమస్యలు, శాంతిభద్రతల అంశాలు ప్రజల్లో చర్చకు వచ్చిన ప్రతిసారీ ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం కొత్త వివాదాలను సృష్టిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా షాబాద్ దైవాలగూడలో జరిగిన దారుణ ఘటన రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. పోక్సో కేసులో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, పోలీసుల నిర్లక్ష్యం కారణంగా నిందితుడు బయటకు వచ్చి మరిన్ని ఘోరాలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇలాంటి కీలక అంశాలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాళేశ్వరం, మేడిగడ్డ అంశాలను మళ్లీ తెరపైకి తెస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్నారని, సాగునీటి కోసం ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. గోదావరి జలాలను వినియోగించి పంటలను కాపాడాలని రిటైర్డ్ ఇంజనీర్లు, రైతు సంఘాలు సూచిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, రాజకీయ విమర్శలు, ప్రత్యర్థులపై ఆరోపణలతో సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. రైతులు నీళ్లు అడిగితే సమాధానం చెప్పాల్సింది పోయి బెదిరింపుల ధోరణిలో మాట్లాడటం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం, సాగునీరు, శాంతిభద్రతలు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వం వ్యవహరిస్తోందనే భావన ప్రజల్లో పెరుగుతోందని పేర్కొన్నారు. రైతాంగం, ప్రజల ఆవేదనను విస్మరిస్తే రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# కుంటలోపడి కౌలు రైతు మృతి

**గార్ల, జూలై 11 ( ప్రభాత గమనం) :**


పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఒక కౌలు రైతు ప్రమాదవశాత్తు చెరువులో పడి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన గార్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రాంపురం గ్రామానికి చెందిన నాగాటి సంపత్ (35) అనే రైతు, ఊర చెరువు కింద ఉన్న వడ్ల వెంకన్న అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పొలానికి నీరు పెట్టే క్రమంలో తోట వద్ద ఉన్న విద్యుత్ మోటార్‌ను బాగు చేయడానికి సంపత్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పక్కనే ఉన్న నీటిలో పడిపోయాడు. దురదృష్టవశాత్తు అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం మృతుడి భార్య నాగాటి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గార్ల ఎస్సై బి. సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



# ‘ఆపరేషన్ సిందూర్’ యుద్ధం కాదు.. మన పవర్

- భారత్ కు యుద్ధం లక్ష్యం కాదు..
- ప్రపంచ శాంతే మన ధ్యేయం
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- వైజాగ్ లో అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి జాతికి అంకితం
- స్వదేశీ సాంకేతికతతో భారత రక్షణ శక్తికి మరో బలమైన అడుగు

**విశాఖపట్నం, ప్రభాత గమనం జూలై 11:**




భారత్‌కు యుద్ధం లక్ష్యం కాదని, ప్రపంచ శాంతి, స్థిరత్వమే తమ విదేశాంగ, భద్రతా విధానానికి మూలసూత్రమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. భారత భద్రతకు ముప్పు ఏర్పడినప్పుడు దేశం ఎలా ప్రతిస్పందిస్తుందో ప్రపంచానికి తెలియజేసేందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని పేర్కొన్నారు. విశాఖపట్నంలో అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరిని జాతికి అంకితం చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐఎన్ఎస్ మహేంద్రగిరి భారత నౌకాదళ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక యుద్ధనౌక అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, భాగస్వామ్యాన్ని భారత్ మరింత పటిష్ఠం చేస్తోందని, దేశ వ్యతిరేక శక్తులకు అవసరమైన సమయంలో తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. విశాఖపట్నం భారత సముద్ర భద్రతకు కీలక కేంద్రంగా అభివృద్ధి చెందిందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయని ప్రశంసించారు. కర్నూలును దేశంలో ప్రముఖ డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ఐదో తరం ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ సాంకేతికత, అండర్‌వాటర్ టార్పెడో వ్యవస్థలు, ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, అధునాతన నిఘా వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ సాంకేతికతలు యుద్ధ అవసరాలతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో మానవతా సహాయ కార్యక్రమాల్లోనూ కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. మారిటైమ్ విజన్-2030 అమలులో భాగంగా ప్రత్యేక మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, షిప్‌బిల్డింగ్ రంగంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. భారత్‌ను ప్రపంచ స్థాయి షిప్‌బిల్డింగ్, మెరిటైమ్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ యుద్ధాల్లో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషించినప్పటికీ, దేశభక్తి, శిక్షణ పొందిన సైనికులు, సమర్థవంతమైన సైనిక సామర్థ్యమే విజయానికి ప్రధాన ఆధారమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కొత్త సాంకేతికత, సంప్రదాయ యుద్ధ విధానాలు పరస్పరం పరిపూరకాలని వివరించారు.ఐఎన్ఎస్ మహేంద్రగిరిలో 75 శాతానికి పైగా భాగాలు స్వదేశీ సాంకేతికతతో తయారయ్యాయని, ఇది ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ నిర్మించిన ఈ యుద్ధనౌకలో బరాక్, బ్రహ్మోస్ వంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలు అమర్చబడి ఉండటంతో సముద్రం, గగనతలంలోని లక్ష్యాలను సమర్థంగా ఛేదించే సామర్థ్యం కలిగి ఉందని అధికారులు వెల్లడించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం సహించేది లేదు

- జూలై 14లోపు 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి
- తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరూ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ప్రభాత గమనం, జూలై 11:**



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి స్పష్టం చేశారు. శనివారం హనుమకొండ పట్టణంలోని గాంధీనగర్, అశోక్ కాలనీ, గోకుల్ నగర్, లష్కర్ సింగారం, లష్కర్ బజార్ తదితర ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఎస్ఐఆర్ నమోదు ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) మాట్లాడిన కలెక్టర్, ఫారముల స్వీకరణ, వాటి డిజిటలైజేషన్ పురోగతి, పెండింగ్ వివరాలను స్వయంగా పరిశీలించారు. లష్కర్ బజార్ పరిధిలో డిజిటలైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సంబంధిత బీఎల్ఓను మందలించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 14వ తేదీలోపు ఎస్ఐఆర్ నమోదు ఫారాల డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు అందిన దరఖాస్తులను అదే రోజు డిజిటలైజ్ చేసి పెండింగ్ లేకుండా చూడాలని, పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, ఐకేపీ ఏపీఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, రిసోర్స్ పర్సన్ల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. సంబంధిత సిబ్బంది బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో సహకరించి ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు ఓటు హక్కును కోల్పోకూడదని, ప్రతి అర్హ ఓటరిని గుర్తించి, వారి దరఖాస్తులను సకాలంలో స్వీకరించి డిజిటలైజేషన్ పూర్తి చేయడం మనందరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు.



# అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం స్వాధీనం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సిసిఎస్ పోలీసు బృందం చేపట్టిన ప్రత్యేక తనిఖీలలో మొగుళ్లపల్లి మండలం అకినపల్లి గ్రామానికి చెందిన గౌరీశెట్టి కృష్ణమూర్తి (తండ్రి: వెంకటరాజం) అనే వ్యక్తి, కిరాణా దుకాణం నిర్వహిస్తూ అక్రమంగా సుమారు 6 నుండి 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించారు. సీసీఎస్ బృందం దాడి నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నిందితుడిని, స్వాధీనం చేసిన బియ్యంతో పాటు మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలకు విజ్ఞప్తి: ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరం. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు తెలియజేయాలని సూచించారు



# పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

- ఏడుగురు నిందితులు అరెస్ట్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలోని సిసిఎస్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో భాగంగా, భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 07 నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి పేకాటలో వినియోగిస్తున్న రూ.4,850 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదుతో పాటు, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ప్రజలను హెచ్చరిస్తూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు సమాచారం అందించాలని కోరడం జరిగింది.

# హసన్‌పర్తి పెద్ద చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, హసన్‌పర్తి గ్రామానికి చెందిన కోడూరి మీనయ్య భార్య రాజమణి (71) గత పదేళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలింపు చేపట్టగా, మధ్యాహ్నం 12 గంటల సమయంలో హసన్‌పర్తి పెద్ద చెరువులో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త మీనయ్య ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

# మేము సైతం..

- గంజాయి నిర్మూలనకై కృషి చేస్తాం..
- వాల్ ఆఫ్ ప్రామిస్ ఫ్రేమ్ లో సంతకాలు చేసిన గ్రామ యువత
- పార్వతమ్మగూడెంలో "మన ఊరు -మన బాధ్యత"
- పాల్గొన్న జిల్లా ఎస్పీ డా. శబరీష్,




ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని పర్వతమ్మగూడెం గ్రామంలో నిర్వహించిన "మన ఊరు – మన బాధ్యత" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్, పాల్గొన్నారు. గ్రామాన్ని గంజాయి రహితంగా, నేర రహితంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామస్థులకు వీడియో ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పిస్తూ, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని వివరించారు. గంజాయి రహిత గ్రామ నిర్మాణంలో ప్రతి గ్రామస్థుడు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. గ్రామ భద్రతలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి, నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపు, ప్రజల భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, గ్రామస్థులు మరియు మీడియా మిత్రులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. హెల్మెట్ వినియోగం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన "వాల్ అఫ్ ప్రామిస్ " (గంజాయి రహిత గ్రామ నిర్మాణానికి ప్రతిజ్ఞ గోడ ) వద్ద గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత మరియు గ్రామస్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి మరియు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరిస్తామని, గ్రామ భద్రతకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ ప్రతిజ్ఞ పత్రంపై సంతకాలు చేశారు. గ్రామ సర్పంచ్, పాలకవర్గం, యువత మరియు గ్రామ ప్రజలు కలిసి "మన ఊరు – మన బాధ్యత" కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తుండటం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ శాఖ చేపడుతున్న ప్రజా భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలకు ప్రజలు నిరంతరం సహకరించాలని కోరారు. గంజాయి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొంటూ, గంజాయి సాగు, రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం అందించిన వారికి రూ.5,000 వరకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ఎలాంటి సమాచారం ఉన్నా 87126 56999 కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మీడియా ప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- దొంగతనం కేసును ఛేదించిన గీసుగొండ పోలీసులు
- వివరాలు వెల్లడిస్తున్న సీఐ విశ్వేశ్వర్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ మహా నగర పరిధిలోని 16వ డివిజన్ పరిధిలోని జాన్ పాకలో చోరీకి పాల్పడిన అంతరాష్ట్ర దొంగను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. సీఐ విశ్వేశ్వర్ కథనం ప్రకారం.. ఈ నెల 10వ తేదీన జాన్పాక గ్రామ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఏపీలోని నెల్లూరు జిల్లా కొండాపురం మండలం పుట్టిపల్లి గ్రామానికి చెందిన నందిపాటి జార్జ్ రమణయ్య ( 64) అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి ట్రాన్స్ ఫార్మర్ వెనుక దాక్కోవడానికి ప్రయత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా వరంగల్ నగరం ఆదర్శ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి, బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతోనే ఈ దొంగతనం చేశారని చెప్పాడు. దోచుకున్న సొత్తును స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.



# నర్సంపేటలో గ్రీన్ రిసార్ట్స్ పై పోలీసుల దాడి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ జిల్లా నర్సంపేటలోని గ్రీన్ రిసార్ట్స్ లో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు నర్సంపేట ఎస్సై అరుణ్ తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు. రిసార్ట్ లోని ఓ గదిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో తమ్మిశెట్టి సురేష్, వీరమనేని సాగర్, శాకమూరి వెంకటేశ్వరరావు, వాంకుడోతు భద్రు, జాటోతు రమేష్ (ఖానాపురం గ్రామం), వేముల కృష్ణారెడ్డి (సర్వాపురం గ్రామం) ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.12,091 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





# ఘనంగా కేంద్రమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు

- గార్లలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

గార్ల, జూలై 11 (ప్రభాత గమనం) :

మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. గార్ల మండల బీజేపీ అధ్యక్షుడు నక్క శివకృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే పార్టీ కార్యక్రమాలు, ఎస్ఐఆర్ (SIR) మరియు బిఎల్ఏ-2 ల విధులపై దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సేనాధిపతి మురళీకృష్ణ, మండల ఇన్‌చార్జ్ బోడ పుణ్య నాయక్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని వారు పిలుపునిచ్చారు.సమావేశం ముగిసిన వెంటనే, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలు అక్కడ ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ, మండల అధ్యక్షుడు నక్క శివకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ బండి సంజయ్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ మోర్చా మాజీ కార్యదర్శి రావుక విమల్ కుమార్ జైన్, ఇల్లందు అసెంబ్లీ కో-కన్వీనర్ కోడేటి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శులు గోనె సాయికృష్ణ, వెంగల బుచ్చిబాబులతో పాటు పార్టీ ముఖ్య నాయకులు బోడ సోనియా, దేవ, రాంబాబు, వాసు, జక్క సత్యనారాయణ, అజ్మీర రాము, వీరస్వామి, గణేష్ నాయక్, హరికృష్ణ ఉన్నారు.



# డిటైన్ వాహనాలను వెంటనే క్లైయిమ్ చేసుకోండి

- లేని పక్షంలో అన్ క్లెయిమ్డ్ వాహనాలుగా ప్రకటించి వేలం వేస్తాం
- ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సీడీఓ సమావేశంలో డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన కేసులకు సంబంధించిన డిటైన్ వాహనాలపై సమీక్ష నిర్వహించినట్లు ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుతం 98 డిటైన్ వాహనాలకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అదేవిధంగా కోవిడ్-19 సమయంలో వివిధ కారణాలతో రోడ్లపై వదిలివేయబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న సుమారు 100 వాహనాలను అప్పటి పోలీసులు స్వాధీనం చేసుకుని భద్రపరిచినట్లు ఆయన వెల్లడించారు. ఈ వాహనాల యజమానులు తమ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్, బీమా తదితర సంబంధిత పత్రాలను సమర్పించి కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో తమ వాహనాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. వాహనాల క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎస్ఐ బి. మంగ, హెడ్ కానిస్టేబుల్ జి. అర్జున్, కానిస్టేబుల్ బి. కుమారస్వామిలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహన యజమానులు ఈ ప్రత్యేక బృందాన్ని సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పిస్తే వాహనాలను అప్పగించే ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. నిర్దేశించిన గడువులోగా ఎవరూ క్లెయిమ్ చేయని వాహనాలను అన్‌క్లెయిమ్డ్ వాహనాలుగా పరిగణించి చట్టపరమైన నిబంధనల మేరకు వేలం వేయనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ హెచ్చరించారు. సంబంధిత వాహన యజమానులు ఆలస్యం చేయకుండా తమ వాహనాలను తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రాజెక్టులు ఉన్నా ప్రయోజనం శూన్యం

- రాజకీయ కక్షలకు రైతులను బలి చేస్తారా?
- ఎల్ నినో ప్రభావంతో అల్లాడుతున్న రైతాంగం
- కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఎందుకు నడపడం లేదు?
- మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నేత శీలంశెట్టి రమేష్

గార్ల, జూలై 11 :( ప్రభాత గమనం)



రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడి, సాగునీటి సంక్షోభంపై రాజకీయాల కంటే ప్రజా శ్రేయస్సే ముఖ్యం కావాలని, పాలకుల కక్ష సాధింపు చర్యల వల్ల తెలంగాణ సమాజం నష్టపోతోందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక, భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటి కోసం ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రమేష్ పేర్కొన్నారు. గత పాలకుల పై, ముఖ్యంగా కేసీఆర్ గారిపై ఉన్న రాజకీయ కోపాన్ని మనసులో పెట్టుకుని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం యావత్ తెలంగాణ ప్రజలను, రైతాంగాన్ని శిక్షిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రాణహిత-చేవెళ్ల నది పరివాహక ప్రాంతంలో ప్రకృతి ప్రసాదించిన పుష్కలమైన నీటి లభ్యత ఉన్నప్పటికీ, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం మళ్లీ పాత కరవు రోజుల్లోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మోటార్లను బంద్ పెట్టిందని శీలంశెట్టి రమేష్ విమర్శించారు. వందల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన పంపింగ్ వ్యవస్థను నిర్వహించకుండా, వాటిని 'చెత్తకుప్పలు'గా మారుస్తున్నారని మండిపడ్డారు. నీటిని ఎత్తిపోయకుండా ప్రాజెక్టులను నిర్వీర్యం చేయడం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తున్నారని ధ్వజమెత్తారు."రాజకీయ విభేదాలు, విచారణలు ఏవైనా ఉంటే అవి రాజకీయ క్షేత్రంలో చూసుకోవాలి. కానీ, ప్రాజెక్టుల గేట్లు మూసేసి, మోటార్లు ఆపేసి, పచ్చని పొలాలను ఎడారిగా మార్చడం ఏ రకమైన పాలన? ఇది ప్రజాస్వామ్యమా లేక పగ సాధింపా?"ఎల్ నినో సంక్షోభం ముంచుకొస్తుందని తెలిసినా, ప్రత్యామ్నాయ నీటి విడుదల కోసం కన్నెపల్లి పంపులను ఎందుకు ఆన్ చేయడం లేదు? కక్షలు పాలకుల మధ్య ఉండాలి కానీ, శ్రమజీవులైన రైతుల మీద, సామాన్య ప్రజల తాగునీటి మీద ఎందుకు చూపిస్తున్నారు? ప్రాజెక్టులను ఎండబెట్టి, తెలంగాణను మళ్లీ వలసల బాట పట్టించడమే ఈ కాంగ్రెస్ ప్రభుత్వ మార్కా?రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరిని, రాజకీయ పట్టింపులను వీడాలని శీలంశెట్టి రమేష్ డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా తక్షణమే వాటర్ లిఫ్టింగ్ ప్రక్రియను ప్రారంభించి, ఎండిపోతున్న చేనులకు, తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజలకు యుద్ధప్రాతిపదికన నీటిని విడుదల చేయాలన్నారు. "తెలంగాణ రైతాంగం కన్నీరు పెడితే ఏ ప్రభుత్వమూ కుర్చీలో నిలబడలేదు" అని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

ప్రభాత గమనం
వరంగల్, ఆదివారం, 12-07-2026



# ముడుపుగల్-అయోధ్య రోడ్డు నిర్మించాలి

**మహబూబాబాద్, జులై 11(ప్రభాత గమనం):**

ముడుపుగల్ అయోధ్య గ్రామాలకు ప్రధాన రోడ్డును నిర్మించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి తండా సందీప్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కట్లోజు పాండురంగ చారి హాజరై మాట్లాడారు..కామ్రేడ్ తండా రామచంద్రు స్తూపం నుండి శనిగపురం చర్చి వరకు రోడ్డును నిర్మించాలని అలాగే అయోధ్య ఎక్స్ రోడ్ నుండి అయోధ్య గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. గత పది సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణం జరగక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని గత ఎన్నికల ప్రచారంలో అయోధ్య ముడుపుగల్ గ్రామాలకు రోడ్డును నిర్మిస్తామని ఎమ్మెల్యే మురళి నాయక్ హామీ ఇవ్వడం జరిగిందని, కానీ నేటికీ రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ముడుపుగల్ అయోధ్య గ్రామ ప్రజలు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం శూన్యమని ఎద్దేవ చేశారు. గ్రామాల్లోని ప్రజలు జిల్లా కేంద్రానికి అనేక సందర్భాల్లో విద్యార్థులు వివిధ రకాలుగా పనిచేసుకునే కూలీలకు రాకపోకలకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే ముడుపుగల్ అయోధ్య గ్రామాలకు రోడ్డు పనులను చేపట్టాలని లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తండా సతీష్, బర్ల వీరన్న, గుణగంటి శేఖర్, పబ్బతి మురళి, తండా శ్రీనివాస్, తండ శ్రీనాథ్, భానోత్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ సిబ్బందికి పరేడ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఉదయం సిబ్బంది విధి నిర్వహణ సామర్థ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక పరేడ్ హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ నేతృత్వంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణలో ఉండే పోలీస్ సిబ్బంది మానసిక ఒత్తిడిని అధిగమించడానికి మరియు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి ఇటువంటి పరేడ్‌లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధుల్లో అత్యున్నత క్రమశిక్షణను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ పరేడ్‌లో ఎస్ఐలు దేవేందర్, రవి, గోవర్ధన్, ఏఎస్ఐ మల్లికార్జున్, మరియు కానిస్టేబుళ్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు



# జనాభా నియంత్రణతోనే కుటుంబ సంక్షేమం


- బ్రహ్మంగారి గుడి తండాలో లయన్స్ క్లబ్ అవగాహన కార్యక్రమం
- పౌష్టికాహారంపై అవగాహన.. తండా వాసులకు పండ్ల పంపిణీ

**కేసముద్రం, జులై 11 (ప్రభాత గమనం):**

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ కేసముద్రం ఆధ్వర్యంలో బ్రహ్మంగారి గుడి తండాలో జనాభా నియంత్రణ, ఆరోగ్యకర జీవన విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ యర్నం శ్రీరాములు మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభా వల్ల కుటుంబాలపై ఆర్థిక, సామాజిక భారం పెరుగుతోందని పేర్కొన్నారు. "ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు.. మూడోవారు వద్దు" అనే నినాదంతో కుటుంబ నియంత్రణ అవసరాన్ని వివరించారు. చిన్న కుటుంబమే సంతోషకరమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బలమైన పునాది అవుతుందని తెలిపారు. అనంతరం తండా వాసులకు సమతుల్య ఆహారం, పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా తండా వాసులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ లయన్ మడిపెద్ది వెంకటేష్, బెజ్జం ప్రేమ్ కుమార్, క్లబ్ సభ్యులు, తండా పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు విడతల్లో పూర్తి చేయాలి
- లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లింపు
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీని వేగవంతం చేయాలి
- భూ రీ-సర్వే, సాదాబైనామా దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్







**మహబూబాబాద్, జులై 11(ప్రభాత గమనం):**

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ, తదితర అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం, ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య దేవ రాజన్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించినప్పటికీ, అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం (లేదా) రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం, ముఖ్యమంత్రి ఆయా గ్రామాల రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకొని, అవసరమైన సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూలై 28లోపు విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. వారికి బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి, నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు అనంతరం నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండో విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వేను నవంబర్‌లోపు పూర్తి చేయాలని, రెండో విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి 2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతమ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో సుమారు 41 వేల గుడిసెలను గుర్తించామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. అలాగే సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల ఏకరూప దుస్తులన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మంది శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల టైలర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. ఈ వీడియో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓ లు రాజేశ్వరి, గణేశ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధే సర్పంచుల ప్రధాన లక్ష్యం

- ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవాలి
- ఎల్ నినో నేపథ్యంలో ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలి
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- సర్ లో ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలి : కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, జూలై 11(ప్రభాత గమనం):**

గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రతి సర్పంచ్ ప్రధాన లక్ష్యంగా ఉండాలని, గ్రామం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం గీసుగొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జుపిడిపి) కింద సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచులు గ్రామ ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధిగా లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది ప్రజల విశ్వాసం, మన్ననలు పొందాలని అన్నారు. గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళిని ఆదర్శంగా తీసుకుని గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించి, గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. ప్రజలకు అత్యవసరమైన అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య, పచ్చదనం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులకు తక్కువ నీటితో సాగు చేసే పంటలు, పంటల మార్పిడి విధానం, సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యుత్ తో పాటు పౌష్టిక ఆహారం అందించుటలో రాష్ట్ర ప్రభుత్వం అందరికీ విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటుందని ఇట్టి విషయాన్ని ప్రతి ఒక్క కుటుంబం ఆలోచించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఒక్క కుటుంబము కృషి చేయాలని వారు పేర్కొన్నారు. వర్ష బాగా పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేయడంతో పాటు మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుటలో ప్రతి ఒక్కరూ కృషి చేసేందుకు గ్రామ సర్పంచులు బాధ్యత తీసుకొని వారి గ్రామాలను సస్యశ్యామలం చేసేందుకు ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే గారు సర్పంచ్ లను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...సమగ్ర ఓటర్ ఇంటింటి సర్వే జరుగుతుందని,ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలన్నారు. 7 రకాల వరి వెరైటీలను లో తక్కువ కాలం ,తక్కువ నీటి తో పండించే పంటలను పండించాలన్నారు. ఎ ఒక్క రైతు నష్టపోకుండా చూడవలసిన బాధ్యత మనది.ప్రస్తుత పరిస్థితుల్లో నువ్వులు , కందులు,మినుములు, బంతి పూలు, తదితర పంటలకు వేసి తక్కువ సమయంలో పంట చేతికి వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. భూగర్భ జలాలు ఇంకిపోకుండా ఉండేందుకు జల శక్తి అభియాన్ ద్వారా గత సంవత్సరం వరంగల్ జిల్లాకు కోటి రూపాయల కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చాయని, ఈ సంవత్సరం కూడా వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు సోక్ ఫిట్, ఫామ్ ఫౌండ్, వర్షపు నీటిని నిలువ ఉంచే తదితర వాటిని ఏర్పాటు చేసి భూగర్భ జలాలను కాపాడాలని అన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుటలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రాంరెడ్డి, డిపిఓ కల్పన, డి ఆర్ డి ఓ నాగ పద్మజ, మరియు సంబంధిత అధికారులు సర్పంచులు పంచాయతీ సెక్రటరీలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి జలసిరి ప్రతిజ్ఞ చేశారు.



# మానవత్వం చాటిన కానిస్టేబుల్

- ప్రమాద బాధితుడికి సకాలంలో ప్రాణరక్షణ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ములుగు జిల్లా కన్నాయిగూడెం స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎస్.కె లాల్ మహమ్మద్ విధి నిర్వహణలో భాగంగా ములుగు కేంద్రంలో డ్యూటీ ముగించుకుని కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్‌కు తిరుగు ప్రయాణిస్తున్న క్రమంలో తన మానవత్వాన్ని చాటుకున్నారు. చింతగూడెం గ్రామ సమీపం లో ఓ వ్యక్తి ప్రమాదానికి గురై రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గమనించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు, వాహనం సంఘటనా స్థలానికి చేరుకున్న అనంతరం బాధితుడిని అంబులెన్స్‌లో ఎక్కించి ఏటూరు నాగారం సీహెచ్‌సీ కు తరలించేలా చర్యలు చేపట్టారు. ప్రమాద బాధితుడి ప్రాణాలను కాపాడేందుకు సకాలంలో స్పందించిన పోలీస్ కానిస్టేబుల్ ఎస్‌కే లాల్ మహమ్మద్ మానవత్వానికి నిదర్శనంగా నిలిచారని స్థానికులు కొనియాడారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయన సేవాభావాన్ని అభినందించారు.

# పొల్లంపల్లి సర్పంచ్ సస్పెన్షన్

**మెదక్, జూలై 11 (ప్రభాత గమనం):**




మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లి గ్రామ సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్ భర్త కొండి స్వామి పంచాయతీ ఆస్తులను ధ్వంసం చేయడం, హరితహారం మొక్కలను నాశనం చేయడం, గ్రామ పంచాయతీ ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడం, మరుగుదొడ్లకు తాళాలు వేయడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామ పంచాయతీ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం, విధుల నిర్వహణలో లోపాలు ఉన్నాయని భావించిన జిల్లా యంత్రాంగం, సంబంధిత నిబంధనల ప్రకారం సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటన జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374